సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 16 । మే । 2024



సోమశిలలో 7.81 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 7.817 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 210 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.74,690
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,689
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,889
నవర (8 గ్రాములు)	రూ.55,112



కారు బోల్తా

కారు బోల్తాపడటంతో ఇద్దరు గాయపడ్డారు. వెంకటాచలం మండలంలోని తాటిపర్తిపాళెం రైల్వే గేట్ వద్ద ఘటన చోటుచేసుకుంది. 10లో

న్యూస్‌రీల్

వీఎస్‌యూ కళాశాల ప్రిన్సిపల్‌గా విజయ



వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా విజయ బాధ్యతలను బుధవారం స్వీకరించారు. అందరి సహకారంతో వీఎస్‌యూ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు. కాకుటూరులోని వీఎస్‌యూలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ అసోసియేషన్ సభ్యులు అభినందనలను తెలియజేశారు.

పది సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టికెట్ల విడుదల

నెల్లూరు(అర్బన్): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను ఆన్‌లైన్లో ప్రభుత్వం విడుదల చేసిందని డీఈఓ రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల లాగిన్ ద్వారా bse.ap.gov.in నుంచి హాల్‌టికెట్లను పొందవచ్చని చెప్పారు. ఇదే వెబ్‌సైట్ ద్వారా స్ట్రీమ్, జిల్లా, పాఠశాల, విద్యార్థి పేరు, పుట్టిన తేదీని ఉపయోగించి నేరుగా సైతం హాల్‌టికెట్లను పొందవచ్చని పేర్కొన్నారు.

లక్ష మందికి పనులే ధ్యేయం



పనులను పరిశీలిస్తున్న వెంకట్రావు

పొదలకూరు: జిల్లాలో ఉపాధి హామీ పనులకు రోజూ లక్ష మంది హాజరుకావాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని డ్వామా పీడీ వెంకట్రావు పేర్కొన్నారు. మండలంలోని పొదలకూరు పంచాయతీ చిట్టేపల్లిలో ఉపాధి పనులను బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాకు 60 లక్షల పనిదినాలను కేటాయించగా, ఏప్రిల్ నాటికి 15 లక్షల మేర పూర్తి చేశామని వివరించారు. కనీస వేతనంగా ఈ ఏడాది రూ.300ను నిర్ణయించారని.. కూలీలు చేసిన పనుల కొలతలు సక్రమంగా వస్తేనే ఈ మొత్తం గిట్టుబాటవుతుందని చెప్పారు. జిల్లాలో రోజుకు 70 వేల మంది కూలీలు పనులకు హాజరవుతుండగా, ఎన్నికల సందర్భంగా ఇది 51 వేలకు తగ్గిందన్నారు. కూలీల సంఖ్యను పెంచేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. నెలాఖరు నాటికి లక్ష మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఏపీఓ మధుసూదన్, టీఏలు సాయి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో నీటి నిల్వ

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 6.784 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 220, పిన్నేరువాగుకు ఐదు, లోలెవల్ కాలువకు 70 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు.

మస్తు పనులు



ఉపాధి పనులకు హాజరైన కూలీలు

గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఆయా గ్రామాల్లో పనులు జోరుగా జరుగుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో సందడి నెలకొంది. గతంలో మాదిరిగా ఈ ఏడాదీ లక్ష్యాన్ని సాధించేలా డ్వామా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఉపాధితో గ్రామాల్లో ఖుషీఖుషీ

- ఈ ఆర్థిక సంవత్సరంలో 60 లక్షల పనిదినాలే లక్ష్యం
- గతేడాది ఖర్చు చేసిన మొత్తం రూ.484 కోట్లు
- కూలీలకు చెల్లించిన నగదు రూ.310 కోట్లు
- 28,894 మందికి 100 రోజుల పనులు

సంవత్సరం	కల్పించిన పనిదినాలు
2019 - 20	79 లక్షలు
2020 - 21	1.10 కోట్లు
2021 - 22	1.29 కోట్లు
2022 - 23	1.06 కోట్లు
2023 - 24	1.19 కోట్లు

నెల్లూరు(పొగతోట): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలకు పనులు కల్పిస్తూ వేతనాలను సకాలంలో చెల్లిస్తున్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో పనులు జోరుగా జరుగుతున్నాయి. వాస్తవానికి 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో 1.2 కోట్ల పనిదినాల లక్ష్యానికి గానూ మార్చి 31 నాటికి 119.73 కోట్ల మేర పూర్తి చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనుల కోసం రూ.484 కోట్లను ఖర్చు చేశారు.

కూలిలకే రూ.310 కోట్లు

ఉపాధి పనులకు హాజరైన కూలీలకు సుమారు రూ.310 కోట్లను చెల్లించారు. రోజు వారీ వేతనంగా రూ.259.38ను అందించారు. గతంతో పోలిస్తే ఈ మొత్తం అధికం కావడం విశేషం. చెల్లింపులను వారి ఖాతాలకు జమచేస్తున్నారు. పనుల పర్యవేక్షణకు క్లస్టర్ ఏపీడీలు, ప్రతి మండలంలో ఏపీఓ, ఈసీ, టీఏలు, బీఎఫ్టీలు, ఎఫ్ఏలు అందుబాటులో ఉన్నారు. కూలీలు చేసిన పనుల వివరాలను ఆన్‌లైన్లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసేందుకు వీలుగా కంప్యూటర్ ఆపరేటర్లు ప్రతి మండలంలో అందుబాటులో ఉన్నారు.

60 లక్షల పనిదినాలు లక్ష్యం

2024 – 25 ఆర్థిక సంవత్సరంలో 60 లక్షల పనిదినాలను లక్ష్యంగా నిర్దేశించారు. కూలీలకు రోజుకు రూ.269 వేతనం వచ్చేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ లక్ష్యాన్ని పూర్తి చేసిన అనంతరం మరో 50 లక్షల పనిదినాలను ప్రభుత్వం కేటాయించే అవకాశం ఉందని డ్వామా అధికారులు తెలిపారు.

గడిచిన కొన్నేళ్లలో ఇలా..

2023 – 24 ఆర్థిక సంవత్సరంలో 28,894 మందికి 100 రోజుల పనిదినాలను కల్పించారు. 2020 – 21లో 19,527 మందికి.. 2021 – 22లో 22,627 మందికి.. 2022 – 23లో 17,411 మందికి 100 రోజుల పనిదినాలు లభించాయి.

జిల్లాలో 4.10 లక్షల జాబ్‌కార్డులు

జిల్లాలోని 37 మండలాల్లో 4.10 లక్షల జాబ్ కార్డులు కలిగిన కూలీలున్నారు. జిల్లాలోని రాపూరు, కలువాయి, సైదాపురం, ఉదయగిరి, మర్రిపాడు, వరికుంటపాడు, వింజమూరు, సీతారామపురం, జలదంకి, బోగోలు, గుడ్లూరు, ఉలవపాడు తదితర మండలాల్లో ఉపాధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రోజూ 60 వేల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. సాధారణంగా జిల్లాలో వ్యవసాయ పనులు అధికంగా జరిగే రోజుల్లో పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య స్వల్పంగా ఉంటుంది. అయితే ప్రస్తుతం ఇవి తక్కువగా ఉండటంతో ఉపాధి పనులకు కూలీలు అధికంగా హాజరవుతున్నారు.

కోవిడ్ సమయంలోనూ ఆపన్నహస్తం

కోవిడ్ సమయంలో పరిశ్రమలు, దుకాణాలు, హోటళ్లు, మాళ్లు ఇలా అన్నీ మూతపడ్డాయి. పనుల్లేక పేద, మధ్య తరగతి ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. బయటకొస్తే కోవిడ్ బారినపడతామనే భయంతో ఇంటికే పరిమితమయ్యారు. ఆ సమయంలోనూ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి కూలీలకు పనులు కల్పించేలా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో కూలీలను ఉపాధి పనులు ఆదుకున్నాయి. కోవిడ్ నిబంధనలను పాటిస్తూ కూలీలకు పనులను కల్పించారు. 2020 – 21 ఆర్థిక సంవత్సరంలో 1.10 కోట్ల పనిదినాలను కల్పించగా, కూలీలకు వేతనంగా రూ.220 కోట్లకుపైగా మొత్తాన్ని వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేశారు.

కూలీల సంఖ్యను పెంచుతాం



ఈ ఆర్థిక సంవత్సరంలో 60 లక్షల పనిదినాల లక్ష్యాన్ని కేటాయించారు. దీన్ని పూర్తి చేసిన అనంతరం ఈ సంఖ్యను పెంచనున్నారు. ప్రస్తుతం రోజుకు 60 వేల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. వీరి సంఖ్యను పెంచేలా చర్యలు చేపడుతున్నాం. కూలీలకు సంబంధించిన వేతనాన్ని వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తున్నాం.

– వెంకట్రావ్, డ్వామా పీడీ

పోలింగ్ శాతంలో స్వీప్

- గత ఎన్నికలతో పోలిస్తే 2.72 శాతం అధికం
- సత్ఫలితాలిచ్చిన జిల్లా అధికారుల చర్యలు
- ఓటరు సహాయ కేంద్రాలతో సౌలభ్యం

నెల్లూరు(దర్గామిట్ట): కేంద్ర ఎన్నికల సంఘ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు చేపట్టిన చర్యలతో పోలింగ్ శాతం గతంతో పోలిస్తే ఈసారి పెరిగింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో జిల్లాలో ముమ్మరంగా చేపట్టిన ఓటరు అవగాహన (స్వీప్) కార్యక్రమాలు సత్ఫలితాలనిచ్చాయి. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచే ఓటర్లను చైతన్యపర్చే కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా ప్రారంభించారు.

ప్రతి గ్రామంలో విస్తృత అవగాహన

నోడల్ అధికారులను ప్రత్యేకంగా నియమించి స్వీప్ కార్యక్రమాలను ప్రతి గ్రామంలోనూ చేపట్టారు. ఓటు వినియోగం, ఆవశ్యకత, ఓటర్లకు కల్పిస్తున్న సౌకర్యాలపై ర్యాలీలు.. ఎల్‌ఈడీ స్క్రీన్లతో కూడిన వాహనాల ద్వారా ప్రచారం చేశారు. ఓటు హక్కు ప్రాధాన్యంపై విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీలు, మానవహారాల ద్వారా ప్రజల్లో అవగాహన ఏర్పడింది. జిల్లా స్థాయి అధికారులు, ప్రముఖులతో ప్రారంభించిన ఓటరు సెల్ఫీ బూత్‌లు బాగా ఆకట్టుకున్నాయి. ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ఓటరు సహాయ కేంద్రాలు సైతం పోలింగ్ శాతం పెంపునకు దోహదపడ్డాయి. యువత కోసం మోడల్ పోలింగ్ కేంద్రం.. దివ్యాంగ ఉద్యోగులతో నడిచే పోలింగ్ కేంద్రాలను తీర్చిదిద్ది ఓటర్లను ఆకర్షించారు. మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాన్ని పింక్ పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేసి మహిళలకు ఘన స్వాగతం పలికేలా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు.



గాంధీబొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఓటరు సహాయ కేంద్రం వద్ద కలెక్టర్ (ఫైల్)

79.63 శాతం పోలింగ్ నమోదు

2019 ఎన్నికల్లో జిల్లాలో 76.91 శాతం పోలింగ్ నమోదైంది. గతంతో పోలిస్తే ప్రస్తుతం 2.72 శాతం పెరిగి 79.63గా నమోదైంది.

మహిళా ఓటింగే అధికం

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటింగ్ భారీగా నమోదైంది. ఒక్క ఉదయగిరి నియోజకవర్గం మినహా మిగిలిన అన్ని చోట్ల ఇదే సీన్ నడిచింది. జిల్లాలో 7,84,219 మంది మహిళలు.. 7,63,894 మంది పురుషులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కోవూరు నియోజకవర్గంలో మహిళా ఓటింగ్ 5791 మేర అధికంగా నమోదైంది. ఉదయగిరి నియోజకవర్గంలో పురుషులు ఎక్కువగా 853 మంది ఓటేశారు. ఆత్మకూరులో 2120 మంది, నెల్లూరు సిటీలో 2891 మంది, నెల్లూరు రూరల్‌లో 4308 మంది, సర్వేపల్లిలో 2689 మేర అత్యధిక మహిళా ఓటింగ్ నమోదైంది. మహిళా ఓటర్ల తీర్పే గెలుపోటములను శాసించనుంది.

ఓట్లు తగ్గినా పెరిగిన పోలింగ్ శాతం

నెల్లూరు(దర్గామిట్ట): గత ఎన్నికలతో పోలిస్తే కావలిలో ఓటర్ల సంఖ్య ఈసారి తగ్గింది. అయితే పోలింగ్ 6.84 శాతం మేర పెరగడం విశేషం. గత ఎన్నికల్లో 2,55,371 మంది ఓటర్లకు గానూ 76.19 శాతం పోలింగ్ జరిగింది. ఈసారి 2,38,553 మంది ఓటర్లకు గానూ 83.03 శాతం పోలింగ్ నమోదైంది. పురుషుల కంటే మహిళలు 2224 మంది అధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

టీబీ సోకకుండా వ్యాక్సిన్

- నేటి నుంచి ప్రారంభం
- తొలి దశలో జిల్లా ఎంపిక
- మూడు లక్షల డోసుల టీకా రాక

నెల్లూరు(అర్బన్): టీబీని నిర్మూలించాలనే లక్ష్యంతో వ్యాక్సిన్‌ను వేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఎంపిక చేసిన వాటిలో తొలి దశలో నెల్లూరు జిల్లా ఉండటం విశేషం. జిల్లాలో వ్యాక్సిన్‌ను గురువారం నుంచి వేయనున్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ఎంపిక చేసిన వారికే తొలి దశలో టీకాను అందజేయనున్నారు. 18 ఏళ్లు నిండి షుగర్ వ్యాధితో బాధపడేవారు.. బాడీ మాస్ ఇండెక్స్ (బీఎమ్మై) 18 కన్నా తక్కువ ఉన్నవారు.. 60 ఏళ్లు నిండిన వారు.. టీబీ కోసం ఇప్పటికే మందులు వాడి కోలుకున్న వారు.. టీబీతో వైద్యం చేయించుకుంటున్న వారందరికీ వ్యాక్సిన్‌ను వేయనున్నారు. టీబీ వ్యాధిగ్రస్తులతో సన్నిహితంగా ఉన్న కుటుంబసభ్యులకు సైతం వ్యాక్సిన్‌ను ఇవ్వనున్నారు.

ఇప్పటికే సర్వే పూర్తి

టీబీ వ్యాధిని 2025 నాటికి నిర్మూలించాలనే లక్ష్యంతో ఈ టీకాను వేయనున్నారు. ఎవరెవరికి టీకాలు వేయాలనే అంశమై వైద్య శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే సర్వే చేసి జాబితాను రూపొందించారు. జిల్లాలోని 667 సచివాలయాల పరిధిలో నర్సింగ్ సిబ్బంది ఈ వ్యాక్సిన్‌ను ప్రతి గురువారం వేయనున్నారు. ఇప్పటికే మూడు లక్షల డోసుల టీకాలు నెల్లూరు చేరుకోగా, వీటిని అన్ని పీహెచ్‌సీల పరిధిలో పంపిణీ చేశారు. ఈ విషయమై జిల్లా క్షయ నివారణాధికారి ఖాదర్‌వలీ మాట్లాడారు. నోడల్ అధికారుల ఆధ్వర్యంలో వ్యాక్సిన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి జిల్లాను క్షయరహిత నెల్లూరుగా మారుస్తామని తెలిపారు.

హరిహరమూర్తిగా మూలస్థానేశ్వరుడు



నగరంలోని మూలాపేటలో గల భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో వసంతోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా హరిహరమూర్తి అలంకారంలో స్వామివారు భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు. ఉభయకర్తగా పలగంటి వెంకటసుబ్బారావు వ్యవహరించారు. ఈఓ వేణుగోపాల్ పర్యవేక్షించారు.

– నెల్లూరు(బృందావనం)

పొగాకు ధరల పరుగు..

- సరాసరిన రూ.238 వద్ద కొనుగోళ్లు
- కిలో గరిష్ట ధర రూ.300
- 130 మిలియన్ కిలోలకు అనుమతి
- ఇప్పటికే 42 మిలియన్ కిలోల కొనుగోళ్లు పూర్తి
- వరుసగా మూడో ఏడాదీ రైతులకు లాభాల పంట
- ఎకరానికి రూ.లక్ష లాభం

పొగాకు సాగు రైతులకు కాసుల వర్షాన్ని కురిపిస్తోంది. ఈ సీజన్లో ప్రారంభ దశలోనే మంచి ధరలు రావడంతో రైతులు లాభాల బాట పడుతున్నారు. అంతర్జాతీయంగా డిమాండ్ ఎక్కువగా ఉండటంతో పాటు స్థానికంగా వ్యాపారులు పోటీ పడుతుండటం రైతులకు కలిసొస్తోంది. ఫిబ్రవరి మూడో వారంలో అమ్మకాలు ప్రారంభమయ్యాయి. నాణ్యత మెరుగ్గా ఉండటంతో ఈ సీజన్‌లో ప్రారంభ ధర రూ.230 పలకగా, అత్యధికంగా రూ.300 వరకు చేరింది. ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. రీజియన్ పరిధిలో ప్రస్తుతం 42 మిలియన్ కిలోల కొనుగోళ్లు పూర్తయ్యాయి. గత రెండు సీజన్లలో రైతులకు మంచి రేట్లు రావడంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం నాలుగు వేల హెక్టార్లు పెరిగింది.

చీమకుర్తి: పొగాకు రైతుల పంట పండింది. వరుసగా మూడో ఏడాదీ పొగాకుకు ఆశించిన ధర కంటే ఎక్కువగా రావడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పొగాకు కొనుగోళ్లు ఈ ఏడాది ఫిబ్రవరి 24న ప్రారంభం కాగా, మొదటి రోజే కిలో పొగాకు ధర రూ.230 పలికింది. గరిష్ట ధర కిలో రూ.300 వరకు, సరాసరి ధర రూ.238.78 పలికిందని పొగాకు బోర్డు అధికారులు ధ్రువీకరించారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మొత్తం 11 వేలం కేంద్రాలు ఉండగా, వీటి పరిధిలో ఈ ఏడాది 72 వేల హెక్టార్లలో పొగాకును రైతులు సాగు చేశారు. 130 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేసేందుకు బోర్డు అనుమతినిచ్చింది. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు 11 వేలం కేంద్రాల్లో 42 మిలియన్ కిలోల పొగాకు కొనుగోళ్లు పూర్తయ్యాయి. బ్రైట్ కలర్ పొగాకే కాకుండా పచ్చ, మాడు రంగులో ఉన్న పొగాకు కిలో ధర సరాసరిన రూ.250 పలుకుతోంది.

దీంతో రైతుల వద్ద నాణ్యమైన పొగాకుతో పాటు మాడు, పచ్చ వంటి లోగ్రేడ్ పొగాకు కూడా మిగలకుండా బయ్యర్లు కొనుగోలు చేస్తున్నారు. వరుసగా మూడో ఏడాదీ పొగాకు రైతులు లాభాల బాట పట్టారు.

నాలుగు వేల హెక్టార్లలో సాగు అదనం

జిల్లాలోని కందుకూరులో రెండు, డీసీపల్లి, కలిగిరిలో వేలం కేంద్రాలున్నాయి. ఈ వేలం కేంద్రాల పరిధిలో 2022 – 23 పొగాకు సీజన్లో వేలంలో రికార్డు ధరలొచ్చాయి. కిలో పొగాకుకు సరాసరిన రూ.214 వరకు పలికింది. ఈ నేపథ్యంలో 2023 – 24లోనూ పొగాకు భారీగా సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. దీనికి అనుగుణంగానే రెండు జిల్లాల్లోని 11 వేలం కేంద్రాల పరిధిలో దాదాపు 72 వేల హెక్టార్లలో పొగాకు పంట సాగైంది. 2022 – 23లో 68 వేల హెక్టార్లలో సాగైతే, ప్రస్తుతం ఇది 72 వేల హెక్టార్లకు పెరిగింది.

ఎకరాకు రూ.లక్షపైనే లాభం

ఈ ఏడాది 72 వేల హెక్టార్లలో 23,930 బ్యారన్ల ద్వారా 30 వేల మంది రైతులు పొగాకును సాగు చేశారని అంచనా. ఒక్కో రైతు తన సొంత బ్యారన్‌తో పాటు మరో రెండు, మూడు బ్యారన్లను అద్దెకు తీసుకొని పొగాకు సాగు చేశారు. ప్రస్తుతం ఒక్కో ఎకరానికి రూ.లక్షకు తగ్గకుండా లాభాలొస్తున్నాయని అధికారులు చెప్తున్నారు. నాణ్యత బాగుండటంతో లాభాలపై రైతులు మరింత ఆశలు పెట్టుకున్నారు. క్యూరింగ్‌లో దాదాపు 70 శాతం పొగాకు బ్రైట్ గ్రేడ్ దిగుబడి వస్తుండగా, 20 శాతం వరకు లోగ్రేడ్, మిగిలినవి ఇతర గ్రేడ్లు వస్తున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్లాట్‌ఫారం పేరు	పొగాకు / మిలియన్ల కిలోలు	సరాసరి ధర
కందుకూరు - 1	5.06	రూ.240.12
కందుకూరు - 2	4.65	రూ.241.04
కలిగిరి	2.81	రూ.239.73
డీసీపల్లి	4.05	రూ.243.12

సరాసరి ధర రూ.238.78 పలికింది

ఈ ఏడాదిలో ఇప్పటి వరకు జరిగిన కొనుగోళ్లలో కిలో పొగాకు సరాసరి ధర రూ.238.78 పలికింది. కనిష్ట ధర రూ.205.. గరిష్ట ధర రూ.300, ప్రారంభ ధర రూ.230 పలికింది. 130 మిలియన్ కిలోలను కొనుగోలు చేయాలని బోర్డు నిర్ణయించగా, ఇప్పటి వరకు 42 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేశారు. కొనుగోళ్లు ఆగస్టు వరకు కొనసాగనున్నాయి.

– లక్ష్మణ్‌రావు, ఆర్ఎం, టుబాకో బోర్డు, ఒంగోలు

డీసీపల్లిలో 910 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 910 బేళ్లను బుధవారం విక్రయించారని నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 963 బేళ్లు రాగా, వీటిలో 910 విక్రయమయ్యాయని చెప్పారు. మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించామని తెలిపారు. వేలంలో 11,15,242 కిలోల పొగాకును విక్రయించగా, రూ.31,75,4751 మేర వ్యాపారం జరిగిందని పేర్కొన్నారు. గరిష్ట ధర కిలో ఒక్కింటికి రూ.299.. కనిష్ట ధర రూ.205.. సగటు ధర రూ.275.55గా నమోదైందని చెప్పారు. వేలంలో 18 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.300

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.300 లభించింది. సాధారణ క్లస్టర్‌కు చెందిన రైతులు 455 బేళ్లను తీసుకురాగా, 433 విక్రయమయ్యాయి. 22 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ మాట్లాడారు. కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.300.. కనిష్ట ధర రూ.205.. సరాసరిగా రూ.270.08 లభించిందని వివరించారు. వేలంలో 14 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

శస్త్ర చికిత్సలను పెంచాలి



మాట్లాడుతున్న సిద్ధానాయక్

నెల్లూరు(అర్బన్): నగరంలోని సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి)లో గల జనరల్ సర్జరీ విభాగంలో శస్త్ర చికిత్సలను పెంచడంతో పాటు రోగులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ ఆదేశించారు. ఆస్పత్రిలోని జనరల్ సర్జరీ విభాగంలో హెచ్ఓడీలు, డాక్టర్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిస్క్ కేసులను ఎట్టి పరిస్థితుల్లో బయటకు పంపొద్దని.. వీటిని చాలెంజ్‌గా తీసుకొని చికిత్సను అందించాలని కోరారు. ఆపరేషన్ అనంతరం ఎక్కువ జాగ్రత్తలు తీసుకొని రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. ఆరోగ్యశ్రీలోనే వీటిని చేయాలని చెప్పారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు ఆరోగ్యశ్రీ సేవలను పెంచాలని.. వైద్యులు సమయపాలనను పాటించాలని కోరారు. డాక్టర్లు కాలేషాబాషా, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పశుపోషకులకు వరం

పాడి రైతుల శ్రేయస్సే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోంది. పశుపోషకులకు ప్రయోజనం చేకూర్చేలా పాలకు గిట్టుబాటు ధర కల్పించే దిశగా అమూల్ అనే సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అమూల్ సంస్థతో కలిసి జగనన్న పాలవెల్లువ కార్యక్రమం ద్వారా పాలను సేకరించనుంది. అందులో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అమూల్ పాల సేకరణను ప్రారంభించిన ప్రభుత్వం జిల్లాలో కూడా ప్రారంభించనుండడంతో పశుపోషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- బల్క్ మిల్క్ కలెక్షన్ యూనిట్లతో పాడి పరిశ్రమ అభివృద్ధి
- జిల్లాలో 323 యూనిట్ల ఏర్పాటుకు స్థల సేకరణ పూర్తి
- ఒక్కో యూనిట్‌కు రూ.10 లక్షలకు పైగా ఖర్చు
- శరవేగంగా నిర్మాణాలు



విజమూరులో నిర్మించిన బల్క్ మిల్క్ కలెక్షన్ సెంటర్ భవనం

కోవూరు: జగనన్న పాలవెల్లువ కార్యక్రమం ద్వారా జిల్లాలో అమూల్ పాలసేకరణ కార్యక్రమాన్ని మరో కొద్ది రోజుల్లో ప్రారంభించేందుకు సన్నాహక కార్యక్రమాలు జరుగుతున్నాయి. జిల్లాలో దాదాపుగా 11 లక్షల ఆవులు, గేదెలు ఉన్నాయి. అలాగే 1.12 లక్షల మంది పాడి రైతులు ఉన్నట్లు అధికారుల అంచనా. జిల్లాలో దాదాపు 20 వరకు ప్రధాన డెయిరీలతోపాటు చిన్నా చితకా డెయిరీలు ఉన్నాయి. 500లకు పైగా పాల సేకరణ కేంద్రాలు ఉన్నాయి. వీటికి సంబంధించి నిత్యం 1.72 లక్షల లీటర్ల వరకు పాల సేకరణ చేస్తుంటారు. కాగా ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందంతో అమూల్ సంస్థ కూడా జిల్లాలో అడుగుపెట్టనుంది.

స్థల సేకరణ

జగనన్న పాల వెల్లువ అంటే జిల్లాలోని పలు పాల కేంద్రాల్లో పాడి రైతులు పాలను విక్రయిస్తుంటారు. కాగా చాలాచోట్ల పాడి రైతులకు సరిపడా గిట్టుబాటు ధర రాలేదని తెలుస్తోంది. జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా అమూల్‌తో కలిసి ప్రత్యేక యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ యూనిట్ల ద్వారా పాలకు కనీస మద్దతు ఇస్తూ పాడి రైతుల నుంచి నేరుగా పాల సేకరణ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో పాల సేకరణకు సంబంధించి బల్క్ మిల్క్ కలెక్షన్ యూనిట్‌లను 323 చోట్ల ఏర్పాటు చేసేందుకు స్థల సేకరణ పూర్తి చేశారు. దాదాపు రూ.10 లక్షల వ్యయంతో ఒక్కొక్క బల్క్ మిల్క్ కలెక్షన్ యూనిట్‌ను నిర్మించనున్నారు. ఇప్పటికే గుడ్లూరు మండలం దరకానిపాడులో, లింగసముద్రం మండలం చిన్నపవనిలో, వింజమూరులో మూడు కేంద్రాలు, వింజమూరు మండలం ఊటుకూరు, గుండెమడకల ప్రాంతాల్లో బల్క్ మిల్క్ కలెక్షన్ యూనిట్ల నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేశారు. మిగిలిన భవనాలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. త్వరలో వీటిని పూర్తి చేసి పాల సేకరణ చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

జిల్లాలో..

బల్క్ మిల్క్ కలెక్షన్ యూనిట్లు	323
తొలి విడతలో నిర్మిస్తున్న భవనాలు	82
పూర్తయిన భవనాలు	7
75 శాతం పూర్తయిన భవనాలు	26
50 శాతం పనులు పూర్తయినవి	22

పెంచలకోన ఆలయానికి భారీ ఆదాయం

రాపూరు: పెంచలకోనలో వెలసిన శ్రీపెనుశిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారికి హుండీల ద్వారా భారీ ఆదాయం సమకూరినట్లు డీసీ విజయసాగర్ తెలిపారు. శ్రీవారి ఆలయ మండపంలో బుధవారం హుండీలోని కానుకలను లెక్కించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 54 రోజులకు గాను శ్రీవారి హుండీల ద్వారా రూ.53.3 లక్షల ఆదాయం సమకూరిందని తెలిపారు. బంగారం 230 గ్రాములు, వెండి 2.9 కేజీలు హుండీల ద్వారా వచ్చినట్లు తెలిపారు. అలాగే విదేశాలకు చెందిన కరెన్సీ నోట్లు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ ఏసీ వెంకటేశ్వర్లు, జిల్లా దేవదాయశాఖ సిబ్బంది, బ్యాంకు, పోలీస్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



హుండీ కానుకలను లెక్కించిన సిబ్బంది

సేవాతత్పరుడు జేఎస్ రెడ్డి

- ప్రముఖుల నివాళులు

శివాజీనగర (బెంగళూరు): జేఎస్ రెడ్డిగా అందరికీ సుపరిచితులైన జక్కా శ్రీనివాసులురెడ్డి గొప్ప సేవా తత్పరుడని ప్రముఖులు కొనియాడారు. ఈ నెల 1వ తేదీన బెంగళూరులో తుదిశ్వాస విడిచిన జేఎస్ రెడ్డి దశదిన కర్మ కార్యక్రమాన్ని బుధవారం బెంగళూరులోని ఇందిరానగర్ క్లబ్‌లో నిర్వహించారు. మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుతోపాటు నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు మాజీ ఎమ్మెల్యే జేకే రెడ్డి, బెంగళూరు తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు ఎ.రాధాకృష్ణరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు భక్తవత్సలరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకట్, సినీ నిర్మాత, దర్శకుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, నెల్లూరు జిల్లాకు చెందిన పలువురు రాజకీయ నాయకులు, బెంగళూరుకు చెందిన వివిధ రంగాల ప్రముఖులు పాల్గొని జేఎస్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. సమాజానికి ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.



జేఎస్ రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వెంకయ్యనాయుడు

భార్య లేదన్న మనస్తాపంతో..

- ఆత్మహత్య చేసుకున్న భర్త
- అనాథలుగా మారిన ఇద్దరు చిన్నారులు

వెంకటగిరిరూరల్: కుటుంబంలో తలెత్తిన చిన్నపాటి మనస్పర్థల కారణంగా క్షణికావేశంలో భార్యను చంపి జైలు పాలయ్యాడు ఓ వ్యక్తి. ఇటీవల జైలు నుంచి విడుదలైన అతనికి భార్య లేని లోటు కనిపించింది. దీంతో మనస్తాపానికి గురై అతడు కూడా ఉరేసుకుని తనువు చాలించాడు. తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయిన వారి పిల్లలు ఇద్దరు అనాథలుగా మారిన ఘటన వెంకటగిరి పట్టణంలోని బొగ్గులమిట్ట ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వెంకటగిరి పట్టణం బొగ్గులమిట్ట ప్రాంతానికి చెందిన రాయని వీరభద్రయ్య (38) బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లి, ఆర్నెళ్ల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. అయితే ఇంట్లో భార్య శాంతితో అతనికి చిన్నపాటి మనస్పర్థలు రావడంతో క్షణికావేశంలో ఆమెను చంపేశాడు. ఈ కేసులో అతను జైలుకు కూడా వెళ్లాడు. వారం క్రితం వీరభద్రయ్య జైలు నుంచి విడుదలయ్యాడు. మంగళవారం రాత్రి అతని తల్లి సుబ్బమ్మ, ఇద్దరు చిన్నారులతో బయట నిద్రిస్తుండగా వీరభద్రయ్య భార్య లేదని మనస్తాపానికి గురై ఇంటి పైకప్పునకు ఉన్న ఇనుప చువ్వకు చీరతో ఉరేసుకున్నాడు. అనుమానం వచ్చి తల్లి సుబ్బమ్మ తలుపు తట్టినా ఎంతకీ తీయకపోవడంతో కిటికీలో నుంచి చూసింది. వీరభద్రయ్య ఉరేసుకున్న విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఏఎస్‌ఐ బీవీ రమణయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

గూడూరురూరల్: ఎన్నికల కోడ్ జూన్ 4వ తేదీ వరకు అమల్లో ఉన్నందున గూడూరు సబ్ డివిజన్‌లో సభలు, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలను నిషేధించినట్లు గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్నికలు ముగిసినా ఫలితాలు వెలువడే వరకు 144 సెక్షన్‌తోపాటు పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉంటుందని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సభలు, సమావేశాల నిర్వహణకు ముందస్తుగా పోలీసు అనుమతి తప్పనిసరి అన్నారు. అలాగే ఈ నెల 13న ఎన్నికల సందర్భంగా చిల్లకూరులో జరిగిన ఘటనకు సంబంధించి విచారణ మొదలెట్టామని, అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైల్లోంచి పడి వ్యక్తి మృతి

మనుబోలు: రైల్లోంచి పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మనుబోలు మండలం కొమ్మలపూడి, మనుబోలు రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం జరిగింది. రైల్వే పోలీసుల వివరాల మేరకు కొమ్మలపూడి రైల్వేస్టేషన్ సమీపంలోని 148/1-3 కిలోమీటర్ వద్ద అప్ లైన్ ట్రాక్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అతను బ్లూ కలర్ కాటన్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. 25 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు ఉండవచ్చని భావిస్తున్నారు. రైల్వే ఎస్సై హరిచందన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.162
లేయర్	రూ.107
బ్రాయిలర్ చికెన్:	రూ.284
స్కిన్‌లెస్ చికెన్:	రూ.314
లేయర్ చికెన్:	రూ.182

నిమ్మధరలు (కిలో)



పెద్దవి	రూ.100
సన్నవి	రూ.40
పండ్లు	రూ.30

బైక్‌లు ఢీకొని వ్యక్తి దుర్మరణం

కలువాయి: మండలంలోని బ్రాహ్మణపల్లి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమశిలకు చెందిన వెంకటేశ్వర్లు(45) మృతిచెందాడు. ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. బైక్‌పై వెంకటేశ్వర్లు కలువాయికి వచ్చి సోమశిలకు వెళుతుండగా.. అదే సమయంలో నగేష్ ఉయ్యాలపల్లి నుంచి కలువాయికి బైక్‌పై వస్తున్నాడు. బ్రాహ్మణపల్లి సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. గాయపడిన వారిని కలువాయి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే వెంకటేశ్వర్లు మృతిచెందాడు. నగేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయమై కలువాయి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటేశ్వర్లు మృతదేహం

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు బోల్తా

- ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు బోల్తా పడిన ఘటన వెంకటాచలం మండలం తాటిపర్తిపాళెం రైల్వేగేటు వద్ద బుధవారం జరిగింది. సర్వేపల్లి వైపు నుంచి తాటిపర్తిపాళెం వైపు వెళుతున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని రైల్వేగేటు బ్రిడ్జి వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారును నడుపుతున్న వ్యక్తితోపాటు మరో మహిళకు గాయాలయ్యాయి. గాయపడిన ఇరువురూ చికిత్సనిమిత్తం మరో వాహనంలో నెల్లూరుకు వెళ్లినట్లు తెలిసింది. ఈ ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు. గాయపడిన వారి వివరాలు తెలియరాలేదు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి



ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

- ఆటో, టాటామ్యాజిక్ వాహనం ఢీ

సోమశిల: అనంతసాగరం మండలం ముస్తాపురం గ్రామ హైవే వద్ద బుధవారం ఎదురెదురుగా వస్తున్న ఆటోలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అనంతసాగరం నుంచి ముస్తాపురం వస్తున్న ఆటో హైవే నుంచి గ్రామంలోకి తిరుగుతుండగా.. బద్వేల్ నుంచి వస్తున్న టాటామ్యాజిక్ వాహనం ఢీకొట్టడంతో ఆటోడ్రైవర్ నల్లకట్ల మల్లెం కొండయ్య (36) అక్కడికక్కడే మృతిచెందాడు. టాటామ్యాజిక్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆటో పూర్తిగా దెబ్బతింది. ఈ ఘటనపై సోమశిల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆటోడ్రైవర్ మల్లెంకొండయ్య మృతదేహం